# అభిమానవతి

మనుషుల్లో మాదిరిగానే సైకిళ్ళలో కూడా రకరకాల మనస్తత్వాలుంటాయి.

ప్రతి విషయంలో, ప్రతినిముషం, పెంకితనం చెలాయించేవాళ్లూ, పోనిద్దూ అంటూ అన్ని సందర్భాల్లోనూ సర్దుకుపోయేవాళ్ళూ, గంటన్నర ముస్తాబు పూర్తిచేస్తేనే కాని గడప దాటి కాలు బయట పెట్టని వాళ్ళూ, గెడ్డం మాసిపోయినా, బట్టలు దుమ్ము కొట్టుకుపోయినా లక్ష్యం చెయ్యకుండా వీధులమ్మట విహారయాత్ర సాగించే అన్నయ్యలూ, అలవాటున్న మనిషి తప్ప అన్యుల నెవర్నీ దరిజేరనియ్యకుండా చీదరించుకొనే అరిస్ట్రోక్రేట్‌లూ, తన పర భేదం లేకుండా కొత్త పాతల్ని లెక్క చెయ్యకుండా అందర్నీ సమానంగా సమాదరించే సామ్యవాద పరాయణులూ – ఇలా రకరకాల మనుష్యుల్నీ, మనస్తత్వాల్నీ మనం రోజూ చూస్తూనే ఉంటాం.

ఈ మాదిరి మానసిక భావాలే – ఈ రకం మనస్తత్వ భేదాలే మనకి సైకిళ్ళలోనూ కనిపిస్తూంటాయి. మీరాసాహేబు సైకిలు పది గజాలు ప్రయాణం చేసేలోపున పదిహేనుసార్లు మొరాయిస్తుంది 'నేను చచ్చినా కదలను' అంటూ. రామచంద్రరావుగారి సైకిలుకి భేషజాలూ శషభిషాలూ లేవు. సౌజన్యవతి అయిన యువతిలా రోడ్డువారనుంచి నెమ్మదిగా పోతూనేఉంటుంది, మధ్య మధ్య పేచీ లేం పెట్టకుండా. వెంకటేశ్వర్రావూ, రమణరావుగార్ల సైకిళ్ళయితే సూర్యోదయానికి పూర్వమే నూనె రాచి నలుగుపెట్టి అభ్యంగన స్నానం చేయించి అలంకరిస్తేనే కాని 'ససేమిరా గేటు దాటం' అంటాయి. ఆచార్లుగారి సైకిలుకి ఆ షోకులేం అవసరంలేదు. నిరాడంబరానికి నిఖార్సయిన ఉదాహరణ అది. ఇక పోతే శాయి సైకిలు మరొకడెవడేనా ఎక్కాడంటే చావుదెబ్బలు తిన్నాడన్నమాటే! శర్మ సైకిలు మళ్ళీ అల్లా కాదు. నవాబుగారి

దగ్గర్నుంచి నౌఖరు దాకా ఎవరిపట్లా తరతమ భేదాలు చూపించకుండా ఎంతో ఓరిమితో వాళ్ళ వాళ్ళ గమ్యాన్ని చేరుస్తుంది.

ఇవేనా సైకిళ్ళలో భేదాలు? ......

అబ్బో - ఇంకా సవాలక్ష ఉన్నాయి!!

పెంకి రాలుగాయిలు - పెడసరం మొహాలు - మొరటు దద్దమ్మలు - ముద్దురాచిప్పలు - అభిమానవతులు అపురూపవతులు - సుకుమార మూర్తులు, సురుచిరగాత్రులు - ఎండ కన్నెరుగని వాన చినుకుపడని వివిధ శబ్ద ఉత్పాదకాలు, నిరంతర నిశ్శబ్ద పథగామినులు ఇలా చెప్పుకుంటూ పోతూంటే ఎన్నో. ఎన్నెన్నో.

అవునా. మరి ఇన్ని రకాల్లోనూ నా సైకిలు ఏ రకమో కొత్తలో నాకూ అర్థంకాలేదు. అది కొన్నాళ్ళు ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారితో కాపురం చేసి, ఆయనకి మోటారు సైకిలు మీదకి మోజు మళ్ళేసరికి సెకండ్‌హేండ్ బండిగా నాకు దఖలుపడింది. దాన్ని అప్పగిస్తూ ఆయన నాకు చెప్పింది కూడా రెండే రెండు మాటలు – "అయ్యా ఇది ఫారిన్ ఫిలిప్స్ బండి – ఇండియాలో దొరికే సరుకు గాదు. జాగ్రత్తగా వాడుకోండి. ఆర్నెళ్ళకో టైరూ, మూణ్ణెళ్ళకో ట్యూబూ వేయించలేక దీన్ని మీకు అమ్ముతున్నాను. మీకా ఇబ్బంది రాదు లెండి. టైరు వేయిస్తే పదేళ్ళు వస్తుంది మీకు. పిట్టమనిషేగా మీరు?" అంటూ తన రెండు వందల ఏభై పౌన్ల శరీరం యావత్తూ ఊగిపోయేలా నవ్వేరు.

ఎత్తుగా ఎక్కడో ఆకాశంలో సీటూ, తెగిపోయేదాకా చాపినా చేతుల కందని హేండిల్‌బారూ, కాంతి కోల్పోయిన నల్లని రిమ్ములూ, తుప్పు పట్టిన ఫ్రేమూ, ఓవేపు విరిగిన స్టేండూ, కదులుతూన్న మడ్‌గార్డూ – ఈ రూపంతో ముసలి ముత్తైయిదువు లాగ కనిపిస్తూన్న సైకిలుకేసి బిక్కమొహం వేసుకుని చూశాను. అదీ నన్ను చూసి నవ్వినట్టే గుర్తు. ఇంకేం? చూపులు కలిశాయి. డబ్బూ, సైకిలూ చేతులు మారాయి.

ఆ రోజున ఇంటిదాకా సైకిల్ని నడిపించుకుని వచ్చినట్లే జ్ఞాపకం. దాన్ని చూసి మా పిల్లల ముఖాలు విడలేదు. శ్రీమతి సరాసరి ముఖం చిట్లించి లోపలికి వెళ్ళిపోయింది. నాకు పౌరుషం వచ్చింది. వళ్ళు మండుకొచ్చింది కూడా. "ఇదిగో సైకిలు ఉపయోగించేది నేను. నాకు నచ్చింది. మీరెవరైనా నోరెత్తారో మర్యాద దక్కదు" అంటూ ఒక్క అరుపు అరిచా. దాంతో గుప్‌చుప్. మాట్లాడితే ఒట్టు.

ఇంట్లో దానికో స్థానం ఏర్పడింది. వీధి గదిలో గోడవార దాని మకాం స్థిరపరిచాను. ఇంట్లోకి ఎవరు వచ్చినాసరే, మొదట దాని దర్శనం చెయ్యవలసిందే.

ఆ సైకిలు రాకతో మా యింటికొక కొత్త కళ వచ్చింది. నాకు కూడా బలం, ధైర్యం, ఎన్నడూ లేని నూతనోత్సాహం వచ్చాయి.

అయితే. మొదట్లో మనవి చేసినట్లు నాకింకా ఆ సైకిలు అభిప్రాయాలూ, అలవాట్లూ, ఆశయాలూ ఏం అర్థంకాలేదు. అది ఏ తరగతికి చెందిందో, దాని మనస్తత్వం ఏవిటో పూర్తిగా తెలియనేలేదు. క్రమంగా అవే తెలుస్తాయని మనస్సుని సరిపెట్టుకున్నాను.

మర్నాడు దాని తత్వం కొంత అర్థం అయింది. ఎలాగంటే – రోజూ తొమ్మిదిన్నరకే భోజనం చేసి ఆఫీసుకి పరిగెట్టే నేను ఆ రోజు సైకిలుందికదా, నాకేం లోటు అనే ధీమాతో కావాలనే ఆలస్యం చేశాను. పదినిముసాలు తక్కువ పదింటికి సుముహూర్తం చూసి. మా అమ్మాయిని ఎదురుగా శకునం రమ్మని పురమాయించి, దేవుడి మీద భారం వేసి, ఎగిరి సీటుమీద కూర్చున్నాను.

అంతే! హేండిల్‌బార్ తాగుమోతువాడిలాగా అటూ ఇటూ ఊగిపోయింది. తొక్కుదాం అన్న పెడల్ కాలికి అందలేదు. ఇంకేం ఉంది? గోవింద! రోడ్డు మీద నేనూ, నామీద సైకిలూను.

'ఎంతపెడసరం సరుకు?' అనుకున్నా. దీనికి పతివ్రతా లక్షణాలున్నాయేమో ఖర్మ ..... అందుకే ఈ పెంకి వేషాలూ. పేట్రేగిపోడాలూ అనిపించింది. కాని వెంటనే ఓ నిర్ణయానికి రాకూడదు తొందరపడి అనే నమ్మకంతో అప్పటికి తమాయించు కున్నాను. సరే వెనక్కివచ్చి బట్టలు మార్చుకుని సైకిలు ఎక్కి ఆఫీసుకి వెళ్ళేటప్పటికి అరగంట ఆలశ్యం. ఆఫీసరుగారి దర్శనం. ఒక వైపునుంచే డైలాగూ, రెండోవైపున తలవంచడం .... అదంతా వేరే కథ అనుకోండి.

ఏమైతేనేం మొదటి ఒకటి రెండు రోజుల అనుభవంతోటే నాకు అర్థం అయిందేవిటంటే నా సైకిలు – అదే – ఏదీ సెకండ్ హేండ్ ఫారిన్, ఫిలిప్స్ – మరీ అంత పెడసరం సరుకూ, మొద్దురాచ్చిప్పా కాదనీ, దాన్ని అర్థం చేసుకుని జాగ్రత్తగా హేండిల్ చేస్తే మనకి నిక్షేపంలా సేవ చేస్తుందనీను. సైకిలు ఎక్కినప్పుడు పాటించ వలసిన విధులుమాత్రం కొన్ని ఉన్నాయి.

అందులో మొదటిది బ్రేకులున్నాయి కదా అని ఇష్టం వచ్చిన స్పీడులో పోవడం అంత శ్రేయస్కరం కాదు. అలాగని బ్రేకులు పనిచెయ్యవు అని నమ్మడం కూడా తప్పే. అందువల్ల బ్రేకులతో నిమిత్తం లేకుండా మన జాగ్రత్తలో మనం ఉండాలి.

ఇక రెండోది – ఎంత కాలు పొడుగున్న కాలాంతకుడికయినా, సీటు మీద

దర్జాగా కూర్చుంటే పాదాలకి పెడల్స్ అందవు. అందువల్ల కాస్త దర్జా తగ్గించి, సీటు మీంచి పూర్తిగా ఓ వేపుకి జారిపోయి, ఓ కాలుని పొట్టి చేసి అయినా - మరో కాలుని పొడుగుచేసుకుని, అథమం ఒక పెడల్‌ని తొక్కుతూ నైనా సైకిలు నడపడానికి సిద్ధం కావాలి.

పాటించవలసిన మూడో విధి ఏమిటంటే - ఉండుండి పెడల్ పట్టు వదిలేస్తుంది. అప్పట్టున వెనక చక్రం ఎత్తి సైకిల్ని గభాల్న ఒక్కమారు కుదెయ్యాలి. ఆ ముచ్చట దానికి తీర్చకపోతే, పెడల్ గుండ్రంగా తిరిగిపోయి, సైకిలు మాత్రం అంగుళమైనా ముందుకి నడవక, నిబడిపోయి, సర్కస్‌లో తీగ మీద అమ్మాయిలా గాలిలో చేతులూ కాళ్ళూ కొట్టుకోవలసి వస్తుంది. కొండొకచో భూమ్యాకర్షణ శక్తి మనల్ని సైకిలునుంచి విడదీసినా విడదియ్యొచ్చు.

ఇక పాటించవలసిన విధులలో ఆఖరిదీ, అతి ముఖ్యమైనదీ ఏవిటంటే ... మనం ఏవైపుకి తిరగాలో ఆ వైపుకి హేండిల్‌బారు ఎప్పుడూ పూర్తిగా తిప్పకూడదు. రెండో వైపుకి కొద్దిగా తిప్పి, అటే వెళుతున్నామని వెనకా ముందూ వచ్చే ట్రాఫిక్‌నీ, మనల్నీ, ఆఖరికి సైకిల్నీ కూడా భ్రమింపజేస్తేనే మనం ఖచ్చితంగా అటు కాకుండా, ఇటు మళ్ళగలిగేదీ, వెళ్ళగలిగేదీను.

ఇలా ఏవో కొన్ని ఆ సైకిలు తాలూకు అలవాట్లూ, అభిప్రాయాలూ ఆశయాలూ, కొంతలో కొంత నాకు తెలిసివచ్చినా, దాని పూర్తి మనస్తత్వంమాత్రం నాకు అర్థంకాలేదు. ఒకళ్ళ కొకళ్ళు అర్థం కాకుండా లక్షలాది - కోట్లాది కాపురాలే సాగిపోతూండగా లేంది, ఇది ఒక లెఖ్కా?

అలాగే సాగిపోయింది సైకిలుతో ఏర్పడ్డ నా సాన్నిహిత్యం పదేళ్ళపాటు- కాని, రోజు లెప్పుడూ ఒకేలాగ సజావుగా సాగుతాయా? చుట్టూ ఉన్న ఆత్మీయులు సాగనిస్తారా? నాకూ, నా సైకిలుకీ చెడ్డరోజులొచ్చాయి. నా చుట్టూ ఉన్న స్నేహితులకీ - బంధువులకీ, ఆఖరికి మా యింట్లో కుటుంబ సభ్యులకీ కూడా సైకిలుకీ నాకూ మధ్య దృఢపడిపోతూన్న ఆత్మీయతని చూసేటప్పటికి కళ్ళుకుట్టాయేమో - మమ్మల్ని ఎలాగైనా విడదియ్యడంకోసం కుట్రపన్నారు. కుట్రలో ప్రథమ ఘట్టంగా, సైకిల్నీ దాంతో పాటు అప్పుడప్పుడు నన్నూ అవహేళన చెయ్యడం వాళ్ళ దైనందిన కార్యక్రమంలో ఒకటిగా చేసుకున్నారు.

వాళ్ళ అవహేళనకి అనుకూలంగా ఊళ్లో సైకిళ్ళు దొంగతనాలు చేసే ముఠా ఒకటి పొరుగు రాష్ట్రంనుంచి దిగుమతి అయింది. ఆ ముఠా, పోలీసువాళ్ళ అండ చూసుకుని, ఉన్న సైకిళ్ళని ఉన్నట్లు మాయంచెయ్యడం ప్రారంభించింది.

ఏ హోటల్లోకో వెళ్ళబోతూనో, ఆఫీసులోకి అడుగుపెట్టబోతూనో, "ఎందుకొచ్చిందీ అసలే రోజులు బాగాలేవు" అంటూ నా సైకిలుకి తాళం వెయ్యబోయానా, వెంటనే మా మిత్రబృందం తమ కార్యక్రమం ప్రారంభించేవాళ్ళు.

"నీ సైకిలుకి తాళం ఎందుకోయ్! అది పట్టికెళ్ళే దౌర్భాగ్యుడెవడున్నాడు."

"ఒకవేళ తెలియక పట్టికెళ్ళినా వెంటనే రెండు లెంపలూ వేసుకుని తిరిగి నీకు తెచ్చి ఇచ్చెయ్యడూ!?"

"నీ సైకిలు ఒకవేళ పోయినా వెంటనే దొరుకుతుంది. తొక్కకుండానే వాడు కిందపడడం ఖాయం. కాలు విరిగి వాడు హాస్పిటల్‌లో జాయిన్ అయితే సైకిల్‌తో సహా నీకు పట్టుడబటం కూడా ఖాయం".

"వాడి కాలు విరిగినందుకు దాన్ని నయంచేసే ఖర్చు నువ్విచ్చుకోవాలి, న్యాయం చెప్పాలంటే".

"నీ సైకిలు కొట్టేశాడో, గుదిబండ మెడకి తగిలించుకున్నాడన్న మాటే?"

"నీ సైకిల్ని మా సైకిళ్ళపక్కని పెట్టకు నాయనా? మాదెంత చచ్చు సైకిలయినా నీ దానిముందు కొత్త హంబర్ లాగ ఆనొచ్చు దొంగాడికి".

"కంపెనీవాళ్లు వందేళ్ళ క్రితంనాటి సైకిలుకి వెయ్యి రూపాయలిస్తాం అంటున్నారుట. మరి చూసుకో ఛాన్స్!".

ఇలా సాగేవి వేళాకోళాలు.

నేనవేం పట్టించుకునేవాణ్ణికాదు.

కొన్నింటికి నవ్వి ఊరుకునేవాణ్ణి.

మరీ అంతగా వాళ్ళు పెట్రేగిపోతే "పోండిరా – నాది ఫారిన్ ఫిలిప్స్. మీరు నాలుగు వందలు పెట్టి కొన్న కొత్త బండికూడా దీని ముందు దిగదుడుపే – కావలిస్తే సైకిలుషాపు మస్తాన్‌ని అడగండి దీన్ని ఎలా పొగుడుతాడో" అని దులపరించే వాడిని.

"అవును – మస్తాను పొగడ్డూ? దీని ధర్మమా అని వారానికి పదీ, పదిహేను రూపాయలు ముడుతున్నాయి వాడికి. ఇలాంటి సైకిళ్ళు ఊళ్ళో పది ఉంటే వాడీపాటికి రెండు మేడలు కట్టి ఉండును" – అంటూ ఒకే ఘొల్లున నవ్వడం అంతాకలిసి.

నా ఎదురుగా నా సైకిల్ని వాళ్ళిలా అవామాన పరుస్తుంటే, చెప్పొద్దూ నాకు తెగ వళ్ళుమండేది. ఈ అవమానాలు భరించలేక నోరులేని వస్తువు పాపం అదెంత

కుమిలి పోయేదో!!! 'బాధపడకు' అన్నట్లు ఓదార్పుగా చూసేవాడిని. అడుగడుగునా అవమానాలకి క్రుంగిపోతూన్నా, అసలు యజమాని అండ ఉందికదా అనే కొండంత ధైర్యంతో అది మానసికధైర్యాన్ని పుంజుకొని మామూలుగా పనిచేసేది.

ఏమైనా, మా మిత్రులు అవమానం చేసిన రోజునమాత్రం అంతంతమాత్రం గానే ఉండేది దాని నడక. మరీ సున్నితమైన హృదయమో ఏమో - పాపం నా సైకిలు కావడంవల్ల అది ప్రపంచంలో అవమానాలన్నీ భరిస్తోంది.

ఒక్క సంగతిమాత్రం నిజం.

ఎంతమంది అవమానపరిచినా, నేనుమాత్రం సైకిలుని జాగ్రత్తగానే చూస్తున్నాను. పల్లెత్తుమాట ఎప్పుడూ అనలేదు. పళ్ళుపిండుకోనూ లేదు. విసుక్కోనూ లేదు. అదే దానికి ఆనందం - బలమూను.

తెల్లారితే సంవత్సరాది పండుగ.

మా ఆవిడ గదులు కడుగుతూ వీధి గదిలో అడ్డుగా ఉన్న సైకిల్ని చూసి అసహ్యించుకుంటూ "దేబె మొహంతో ఇదొహటి ఇంట్లో అడ్డుగా - తీసి అవతల పెట్టండి. గదులు కడిగి ముగ్గులెట్టుకోవాలి! మళ్ళీ లోపలికి తీసుకు వస్తే చాలు శుభ్రంగా కడిగిన గదిని కాస్తా మురికి చేసి వదిలేస్తుంది. చక్రాలతో పట్టుకొస్తుంది మహాతల్లి తట్టెడు మట్టీ బండెడు ఇసుకాను - ఏబ్రాసి. దీని శని ఎప్పుడు విరగ డవుతుందో కాని" ఇలా అనరాని మాటలన్నీ అంది.

ఆ రోజు ఏవిటో నాకూ ఆ సైకిల్ని చూస్తే విసుగేసింది. మర్నాడు సంవత్సరాది. ప్రొద్దుటే మావిడికాయలు కొందామని బజారుకి వెళితే నడిచి చావదే!

గాలి పోయింది. వాల్ ట్యూబ్ లేదు. ట్యూబ్ కొత్తది వేయించి కొంత దూరం వెళ్ళేసరికి చైన్ తెగిపోయింది. దాన్ని సరిచేయిస్తే బెల్ మోగడంలేదని తెలిసి వచ్చింది. ఆ తర్వాత బ్రేకులు పట్టుపట్టడం మానేశాయి. సంవత్సరాది పండగ పూటా మస్తాన్‌కి రెండు గంటలు పని చెప్పింది. నాకు పన్నెండు రూపాలు వదిలించింది. విసుక్కుంటూ నాలుగు గజాలు వచ్చిందో లేదో, అడుగు ముందుకి వేసేది లేదంటూ పెంకితనం చేసింది. "మళ్ళీ ఏవిటైంది మస్తానూ?" అంటూ అతనిమీద విసుక్కున్నా.

"చక్రం బెండ్ అండీ" - మస్తాన్ సమాధానం.

నా కోపం, విసుగూ, అసహ్యమూ తారస్థాయిని చేరుకుంది.

"ఈ శనిని నేనింక భరించలేనయ్యా. ఎవరికేనా కావాలేమో చూడు. దీన్ని అయిన కాడికి అమ్మేద్దాం" అన్నా.

"ఎందుకు సార్! నిక్షేపంలాంటి ఫారిన్ బండి".

"ఫారిన్ కాదు. నా పాలిటి పాపిష్టిబండి".

అంతే – అనకూడని మాట అనేశా.

ఆ సాయంత్రం అందరితోపాటూ దేవాలయం ముందు నా సైకిలుకూడా తాళం వేసి లోపలికి వెళ్ళా పంచాంగ శ్రవణంకోసం.

శాస్త్రుర్లుగారు నా నక్షత్రం కలవాళ్ళందరికీ సంవత్సర ఫలాలు చెబుతున్నారు. "చెడ్డ రోజులు పోయాయి. ఇంక ముందున్నవన్నీ మంచి రోజులే. శుభవార్త చెవిని పడుతుంది. ఆకస్మిక ధనలాభం, అదృష్టయోగం" అంటూ. స్నేహితుల్తో కలిసి నవ్వుకుంటూ దేవాలయం బయటికి వచ్చి, జేబులోంచి సైకిలు తాళంచెవి తీసి, చేత్తో పట్టుకున్నా –

కానీ సైకిలేదీ? .....

"అరే నీ సైకిలే పోయిందా?"

"వాడెంత దరిద్రుడురా?"

"పాపం! ఏం అవస్థ పడుతున్నాడో. ఏమో"

"గోవిందా గో ..... హ్ ..... గోవింద! ఈ శుభ సందర్భంలో నడవండి గ్రాండ్ పార్టీ చేసుకుందాం"

ఇలా అంతా ఆనందించేవాళ్ళే కాని తాళంచెవి చేత్తో పట్టుకుని బాధగా నిలబడిపోయిన నా మానసిక స్థితిని అర్థం చేసుకున్నవాడు ఒక్కడూ లేడు.

నా హృదయం ఆవేదనతో నిండిపోయింది. సైకిలు పోయినందుకు కాదు – ఎప్పుడూ లేంది పొద్దుట ఎంత మాట అన్నాను దాన్ని అని నేను పశ్చాత్తాపంతో.

దాన్ని ఎవడో దొంగాడు ఎత్తుకుపోయాడంటే నాకు నమ్మకం లేదు. ఇన్నాళ్ళూ లేంది ఇవాళే ఎందు కెత్తుకెళ్ళాలి? ... పైగా తాళం వేసి ఉన్నదాన్ని?"

సందేహం లేదు. నా సైకిలు మనసు ఎంతో క్రుంగిపోయింది. అందరూ అవమానించినా ఎలాగా సహించుకుంది కాని, నేను కూడా అసహ్యించుకునేసరికి

ఇంక భరించలేక వెళ్ళిపోయింది. అవును. ఇన్నాళ్ళూ నేను కనుక్కోలేక పోయాను కాని, దానిదెంతో సున్నితమైన హృదయం, పౌరుషమైన బ్రతుకు.

అభిమానవతి అది!

పల్లెత్తుమాటకూడా పడలేని అభిమానవతి! ఇన్నాళ్ళకి ఇప్పుడాలశ్యంగా అర్థం అయింది దాని మనస్తత్వం నాకు.

నా సైకిలు పోయినందుకు మా ఆవిడతోసహా నా బంధుమిత్రులంతా పండగ చేసుకున్నారు.

అంతేకాదు, లోకమే, సంవత్సరాది అనే వంకతో, నా సైకిలు పోయిన పండగ చేసుకుందని నా అనుమానం.

ఆ రోజున సంతోషం లేకుండా విచారంగా ఉండిపోయింది నేను ఒకణ్ణే.

నాకు ఒక్కడికే ఆ అభిమానవతి అర్థం అయింది. అందుకే నాకు ఒక్కడికే అది పోయినందుకు దిగులు.

నా కంటే ఎక్కువ దిగులు పడిన వాడున్నాడంటే, అది ఒక్క మస్తానే!

(విజయ)

*